స్కెచ్

# ధూమలోకం

మౌద్గల్య

మహాదేవరావుగారి యిల్లు పిన్నలతోటి పెద్దలతోటి కళకళ్లాడుతూంది. కారణం "యే తత్శుభముహూర్తాన సౌభాగ్యలక్ష్మిని దేవాంతకరావుకిచ్చి వివాహమహోత్సవము జరుప నిశ్చయించిరిగావున." ఈ విషయం దేవాంతకరావుకి కొన్నిరోజులు సమస్యగాపరిణమించేసి. కానిచేస్తో "మహాదేవరావుగారు కాళ్లుకడిగి పిల్లనిస్తారు."

అతిథుల్ని రిసీవ్ చేసుకోడంలో అలసిపోయిన వెంకటరావు కాబోయే బావగారితో పిచ్చాపాటీ మొదలెట్టేడు అనుకోని విషయంమీద. ఆ సమయంలో-

"బావగారూ! సుమారు గంటకెన్ని కాలుస్తారండీ?" అన్నాడు. వెంకటరావు. దేవాంతకం కాస్త నొచ్చుకున్నట్టుంది బావమరిది హాస్యం. కటువుగా "సుమారు యిరవై" అన్నాడు.

"మీకలవాటుకోలేదు; క్షమించండి."

దేవాంతకానిది కాస్త మెత్తనిగుండె యిట్టే కరుగుతుంది. ఐస్‌లాంటిది. రిపెంటెన్స్ కావాలని డిమాండుచేస్తాడు కాని ప్రతిజ్ఞ పూనడు. ఉపన్యాస ఫక్కీలో పోనిచ్చాడు మాటలు.

"అలవాటుకేముంది? నాలుగురోజులు ఓపిక పడితేసరి. కాని నా తత్వం అంతటితో ముగిసేది కాదు. ఆపదలందుగాని సంపదలందుగాని సానుభూతితో మనస్సును స్వస్థపరిచేది అలవాటని వాదిస్తాను." ఈ మాటలకి వెంకట్రావు నిజంగా భయపడ్డాడు. ఏంచెప్పాలో అర్థంకాక "నిజమే! మీరన్నది నిజమే" నని వెర్రిగా చూశాడు.

అదో మోస్తరుగా "యిలాగే ప్రతి అలవాటుకీ యేదో అర్థముంటుందంటావు?" ప్రశ్నించాడు దేవాంతకం వెంకట్రావుకేమి జవాబు చెప్పాలో తోచిందికాదు. ఇంతలోనే ఇంట్లోనుంచి మహాదేవరావుగారి కేకవిని చల్లగా జారుకున్నాడు.

దేవాంతకం ఆంధ్ర సారస్వతాన్నంతటినీ పుక్కిలి పట్టేడు. అదీగాక అభ్యుదయ రచయిత కవి-విమర్శకుడు... దేవాంతకానికిఆంధ్రదేశంలో కీర్తి సంపాదించుకోనేందుకు కృషి సలుపుతూనే ఉన్నాడు. ఇంతకి అతనికా హక్కు ఉంది. ఈ విషయంలో ఆంధ్రదేశం యింకా అతనికి బాకీపనే ఉంది. ఎప్పుడో వడ్డీతో సహా వసూలు చేయగల ధీశాలి గనుకనే అప్పుడప్పుడు "ఆంధ్రదేశం నుంచి నాకు కొంత కీర్తి రావల్సి ఉంది త్వరలోనే వచ్చేస్తుంద"ని అతనంటూండడంకద్దు.

నిజంగా అతనిలాంటి మహాకవి...(భావిలో) అల్లుడుగా దొరికాడని సంతోషించడం మానేసి అతని అలవాట్లజోలికి పొమ్మనెవరు చెప్పారు?

దేవాంతకం ఒకొక్కమాట అన్నాడంటే అందులోంచి తేనె లొలుకుభావాలు కావలసిందే! ఒకమాటు నేనుకూడా "సిగరెట్లు మానెయ్యమని మందలించినప్పు"డు మాటలు మచ్చుపటాకీగా చూపిస్తున్నా..."నేను విశ్వశాంతి కావాలని యింకా ఏవేవో భావాలతో కవిత్వంలో కాకిలాగ అరుస్తుంటే "కన్సిడర్" చేసేవాడేడీ! నాలో లోపాలు యెంచేవాడే కాని శక్తిని అర్థంచేసుకునేవాడొక్కడు కనిపించడు. ప్రపంచం అంతే లే" ఈ మాటలు తూస్తే తులం బరువు తగ్గవు.

* * *

సిగరెట్ కాలుస్తూ యీజీచైర్‌లో కూర్చున్న దేవాంతకం విశ్వామిత్ర సృష్టి చేస్తున్నాడు. నోట్లోంచి వస్తూన్న పొగ దేవాంతకంతో చెలగాటం ఆడుతూంది, రెండు పేకెట్లు ఖాళీ అవడంతో చుట్టూరా ఉన్న ధూమం, దేవాంతకం చిన్న మేఘంలో కూర్చున్నట్టనిపిస్తూంది.

"ఇన్ని సిగరెట్లేమిటండీ" మెల్లగా ఒక స్త్రీకంఠం.

దేవాంతకం చిరునవ్వుతో పలకరించేడు. నోట్లోనిలచిన పొగ దూడుసుగా ఆమె ముఖం మీదకు వచ్చింది.

"ఛీ...పోనిద్దురూ..." అంటూ వెనుదిరిగింది వెళ్ళిపోడానికి.

"భాగ్యం సిగ్గెందుకు? మన మిప్పుడు భార్యాభర్తలం తెలుసా!" దగ్గరగావచ్చి తల నిమురుతూ కూర్చుంది భాగ్యం. దేవాంతకం ఊహాగానం ఊర్వశినే తలదన్నింది.

"సిగరెట్లు మానేయరూ...ఎలాగున్నారో చూశారా?" అంది అమాయకంగా.

"భాగ్యం" అన్నాడు దేవాంతకం "ప్రతివాళ్లు నాతప్పు లెంచేవారేతప్ప" "అబ్బ మానేస్తాయేం పోయింది?"

"నాకసలు యీ అలవాటెలా వచ్చిందో తెలిస్తే మానేస్తే యేం పోతుందో తేల్తుంది. నా మాట వింటావా? అలా కూర్చో" గొంతు సవరించుకున్నాడు దేవాంతకం.

"జీవితాన్ని మార్చెయ్యడానికి ఒక్క సంఘటన చాలదూ?"

"బాగుంది మీవరస. ఇప్పుడిదంతా దేనికి?"

"నీకు తెలీదు భాగ్యం. నా హృదయాన్ని ఎవరికి చెప్పమన్నావు?"

"పోనీ లెద్దురూ! ఏదో మాట వరసకంటే అంత పట్టించుకోనంత అగత్యం దేనికి?" దేవాంతకం మళ్ళీ ఆరంభించేడు.

"నా సిగరెట్లు అలవాటుగురించే చెబుతాలే రెండు సంవత్సరాలక్రితం. అప్పుడు నేను యింటర్ చదివేరోజులు సంఘం అంటే ఏమిటో తెలియక అందరాని ఆశలకోసం అర్రులుచాచే అజ్ఞానం కళ్లల్లో కమ్ముకుపోయిన వయసు భాగ్యం అనుభవం మీద నేగా అంతా తెలుసుకోడం. ఈప్రపంచమంతా నాకోసమే ప్రత్యేకించ బడిందని, ఒక అమాయకురాలిని ప్రేమించాను. నా సర్వస్వం ఆమెకోసమే త్యాగంచేయ నిశ్చయించాను. కాని పాడులోకం ఎప్పటిలాగే మాతో జోక్యం కలిగించుకుని విడదీసింది. నాకు జీవితం విషతుల్యమయింది. జీవితానికున్న స్వల్పవ్యవధిలో అనుకున్న ఆశయాలు నెరవేరక పోయినప్పుడు మనిషికింకో మార్గం ఏముంది?"

"నిస్పృహ నిరాశ నా హృదయంలో తలవిరబోసుకుని నృత్యంచేసేయ్. హృదయంలో రగిలే వ్యథ వ్యాధిగా పరిణమించింది. ఏదో ఎడతెగని నొప్పి పక్కలో వచ్చేది. స్కూలు మానేసి .. చదువుమానేసి యెప్పుడూ నిద్రపోయినా తగ్గలేదు. సమంగా యిరవైరోజులు బాధపడ్డాను. కాని భరించలేకపోయా. ఒకరోజు సాయంత్రం ఆత్మహత్యచేసుకుందామన్న సంకల్పంతో బయలుదేరాను మెరీనాలో నేనొంటరిగా తిరుగుతూన్నట్టు గమనించి నన్నర్థంచేసుకున్న స్నేహితుడొకడు నన్ను రక్షించడానికొచ్చాడు, నా కడుపునొప్పి గ్రహించి గట్టిగా సిగరెట్ దమ్ములు లాగమన్నాడు. అతను చెప్పినట్టు చేసా. నొప్పి తగ్గినట్టయింది ఆరోజు. రెండురోజుల్లో పూర్తిగా పోయింది. కాని సిగరెట్లు అలవాటయ్యాయి. ఇప్పుడు నేను సౌఖ్యాన్ని కొనుక్కోవచ్చు... యెక్కడికి కావలిస్తే అక్కడికే తీసుకుపోవచ్చు. నా సౌఖ్యం నాచేతిలో యిమిడింది" అని దేవాంతకం మరొకదమ్ము లాగేడు.

భాగ్యం కోపంగా లేచింది.

"భాగ్యం యిందులో కోపంరావలసినదేముంది?"

"అబ్బే యేమీలేదు..మీ ప్రేమ..మీసిగరెట్.. నాతో మాట్లాడకండి.."

"అరెరె... భాగ్యం" అంటూ ప్రాధేయపడ్డాడు.

"ప్రేమించిన యువతిని సిగరెట్ కాల్చి మరపుతెచ్చుకున్నావు..రేపు నాగతి యేంకావాలి? ముందుగానే మా నాన్నగారితో చెప్పివుంటే!"

భాగ్యం.. భాగ్యం.. నా మాట వినవూ.. నే చెప్పినదంతా ఉత్తదే.. కాస్తకల్పించి ఆర్టిస్టిక్ గా చెప్పానంతే"

"అయితే మిమ్మల్నసలే నమ్మకూడదు"అంటూ చర్రున గదిలోకెళ్ళింది. దేవాంత కాళ్ళకింద భూమి కదిలింది. "భాగ్యం" అంటూ గట్టిగా కేకేసాడు.

...... పెళ్ళివారందరూ దేవాంతక చుట్టూమూగారు. వెంకట్రావు దేవాంతకాన్ని సేదతీర్చి "ఏమిటోయ్ బావా పెళ్ళవకముందరే మా చెల్లెలిగురించి పలవరిస్తూ పరవళ్లు తొక్కుతున్నావ్?" అన్నాడు. దేవాంతకానికి కలసంగతి జ్ఞాపకముండిపోయింది. "సిగరెట్ మానేస్తానోయ్"అన్నాడు. అర్థంకాక ఆడపెళ్లివారందరూ గొల్లున నవ్వారు. అమ్మలక్కలు "మేమిశోద్దెమే తల్లీ"అని బుగ్గమీద వేలేసుకున్నారు. ★

# అమెరికా : కమ్యూనిజం

ఓమార్ బ్రాడ్లీ

(అమెరికా యుద్ధతంత్ర కార్యాలయం మాజీ అధ్యక్షుడు)

ఈనాడు ప్రపంచంలో కోట్లకొద్దీ జనం తినడానికి తిండీ వుండడానికి పంచా కరువై అలమటిస్తున్నారు. ప్రతివారికి తమ పొరుగువారి పైన నమ్మకంకంటె అపనమ్మకమే ఎక్కువగా వుంటున్నది. ప్రతివారు భయసందేహాలతో కొట్టుమిట్టాడుతున్నారు. ఆత్మవినాశనం పొందకుండా వుండాలని మానవజాతి ఘోషిల్లుతున్నది. ఇది అమెరికాను ఈనాడు ఎదుర్కొంటున్న సవాల్.

ఇటువంటి విపత్కర పరిస్థితులనుంచి బయట పడడానికిగాను స్వతంత్రదేశాల ప్రజలందరూ అమెరికాపైన ఆశలు పెట్టుకున్నారు. ఇటువంటి వారి రక్షణకై మనం శాయశక్తులా పాటు పడాలి. ఆకలితో అలమటించేవారికి ఆహారపదార్థాలు అందించాలి. భయంతో బాధపడేవారికి మనస్థయిర్యాన్ని చేకూర్చాలి. అనుమానాలతో సతమతమౌతున్న వారికి నమ్మిక చేకూర్చాలి. అన్యాయాన్ని న్యాయంతోను - అన్నిటికంటె ముఖ్యంగా, దౌర్జన్యాన్ని బలసామర్థ్యాలతోను- మనం ఎదుర్కోవాలి. లేకపోతే ఈ దేశాలవారు నిరాశకు, నిస్పృహకు లోనవుతారు. ఇటువంటి కలవరం కారణంగానే సాధారణంగా యుద్ధం, భీభత్సం తలెత్తుతూ వుంటాయి.

ఈ సవాలును ఎదుర్కోవడం ద్వారానే అమెరికా ప్రజలు మానవజాతి స్వాతంత్ర్యానికి దోహదం చేయనున్నారో, లేక మానవాళిని క్రౌర్యానికి, బానిసత్వానికి కల్లోలానికి వదిలి వేయనున్నారో వెల్లడి అవుతుంది.

ఎక్కడ ఏ చిన్నవివాదం తలెత్తినా అది ప్రపంచశాంతికే అత్యంత ప్రమాదకారికాగల పరిస్థితులలో ఈనాడు మనమున్నాం. గ్రీసులో ఒక కుగ్రామంలోగాని, కొరియా సరిహద్దు గస్తీదళ శిబిరాలవద్దగాని, బెర్లిన్ రైలుమార్గం వద్దగాని ఏదైనా చిన్న సంఘర్షణ ప్రారంభమైతే అది ప్రపంచశాంతికే భంగం కలిగించగల పరిస్థితులు ఈనాడు ఉన్నాయి. ఏదేశమూకూడా ఒంటరిగా మనలేదనీ, ప్రపంచ సమస్యలు అవిభాజ్యమైనవనీ మనం గుర్తించాలి. ఇతర ప్రపంచాన్ని ఎదుర్కొంటున్న ప్రమాదాలు, మనను ఎదుర్కొంటున్న ప్రమాదాలు, ఇతర ప్రపంచపు కోర్కెలు మన కోర్కెలు ఒకేవిధమైనవని మనం గుర్తించాం.

యుద్ధంవల్ల ప్రజలకు కలిగిన బాధను శాంతి ఒప్పందాలుకూడా నివారించలేకుండావున్నాయి. ఈ బాధలు నివారించబడకపోతే ఇవి త్వరలోనే ప్రపంచానికి ముప్పు తెచ్చిపెడతాయి. ఈ ప్రపంచంలో సగభాగం స్వతంత్రంగాను, సగభాగం అస్వతంత్రంగాను మనలేదు. అలాగే సగంమంది సకల సౌకర్యాలతో తులతూగుతుండగా, మిగిలిన సగంమందీ తినడానికి తిండి, కట్టుకొనడానికి బట్ట ఉండడానికి ఇల్లు మొదలైనవి ఏమీలేకుండా వుండలేరు. ఇటువంటి పరిస్థితులలో వారు శాంతియుతంగా జీవించలేరు.

అంతేగాక భయం, సందేహం గూడు కట్టుకున్న ఉద్రిక్త పరిస్థితులతో ప్రపంచం శాశ్వతంగా మనలేదు.

ఏనప్పటికీ కల్లోలం భయం, దౌర్జన్యం మొదలైన ప్రమాదాలపట్ల ఉదాసీనవైఖరిని అవలంబించడంగాని, లేక వాటిని అలక్ష్యంపెట్టడంగాని అమెరికా ప్రజలు చేయరు. నిజానికి ఇవన్నీ దుష్టశక్తులు. వీటితో ఏదోవిధంగా సరిపెట్టుకుని పోవడానికి వీలులేదు. అలా సరిపెట్టుకుని పోదామనుకుంటే ఆ శక్తులకు దాసోహమనడమే అవుతుంది.

అలాగే యుద్ధంవల్ల కలిగే భీభత్సం విషయంలో మనకున్న సందేహాలకుకూడా సరియైన సమాధానంలేదు. ఎందువల్లనంటే కల్లోలం, దారిద్ర్యం, భయం మొదలైనవి యుద్ధానికి దోహదం